క్లుప్తంగా

కాంగ్రెస్ సేవాదళ్ ఉపాధ్యక్షుడిగా వంశీకృష్ణ



వంశీకృష్ణకు నియామకపత్రం అందజేస్తున్న జితేందర్

కొత్తగూడెంరూరల్: కాంగ్రెస్ పార్టీ జిల్లా సేవాదళ్ ఉపాధ్యక్షుడిగా వంశీకృష్ణను నియమిస్తూ తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ సేవాదళ్ అధ్యక్షుడు మిద్దెల జితేందర్ శుక్రవారం నియామకపత్రం అందించారు. వంశీకృష్ణ మాట్లాడుతూ... పార్టీ ఆదేశాలను పాటిస్తూ, రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ గెలుపునకు కృషి చేస్తానని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క రాష్ట్ర మంత్రి వర్గానికి, శ్రీమతి రేణుక చౌదరి, జిల్లా మంత్రులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావుకు, తన నియామకానికి కృషి చేసిన ఎమ్మెల్యేలకు సేవాదళ ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు.

బియ్యం వితరణ

టేకులపల్లి: తడికలపూడి గ్రామపంచాయతీ కోక్యాతండా గ్రామంలో అనారోగ్యంతో ఇటీవల మృతి చెందిన గుగులోత్ సజాన్ కుటుంబానికి కోరం కనకయ్య యూత్ నాయకుడు ధరావత్ లక్ష్మణ్ శుక్రవారం 50 కిలోల బియ్యం, నిత్యావసర వస్తువులు అందజేశారు. కార్యక్రమంలో బాలు, చందర్, గోపాల్, నారాయణ, మంజి, దేవేందర్, రాంబాబు, రవి, హరి తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం



నగదు అందజేస్తున్న మోటార్ వర్కర్స్ యూనియన్ సభ్యులు

ఇల్లెందు: పట్టణంలోని రైల్వే బ్రిడ్జి ఏరియాలో వెల్డింగ్ షాప్ నిర్వాహకుడు తాడ్ర కృష్ణ అనారోగ్యంతో ఇటీవల మృతి చెందాడు. ఆ కుటుంబానికి ఇల్లెందు ఆటోనగర్ ఆల్ మోటార్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో శుక్రవారం రూ.20 వేల ఆర్థిక సాయం అందజేశారు. రఫీ, మల్లేష్, షఫీ, మున్నా, లక్ష్మీనర్సింహా, యాకూబ్, పోలు శ్రీను ఉన్నారు.

హర్యానాలో జిల్లా వాసి మృతి



దేవేందర్ (ఫైల్)

పాల్వంచరూరల్: పాల్వంచ మండలం రాజాపురం గ్రామానికి చెందిన ఓ యువకుడు హర్యానా వెళ్లగా అక్కడ అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. ఈ మేరకు మృతదేహాన్ని ఆయన స్నేహితుడు శుక్రవారం స్వస్థలానికి తీసుకురాగా తమకు అనుమానాలు ఉన్నాయంటూ కుటుంబీకులు ఆందోళన చేపట్టారు. వివరాలు... రాజాపురం గ్రామానికి చెందిన పడిగ దేవేందర్(22) ఈనెల 17వ తేదీన ఆళ్లపల్లికి చెందిన ఈసం రవిబాబుతో కలిసి హర్యానా రాష్ట్రం బిలాని జిల్లా తోసమ్ వెళ్లాడు. అక్కడ కొన్ని ప్రాంతాల్లో పర్యటించాక దేవేందర్ మరికొందరితో కలిసి హిజ్రాగా మారేందుకు ఎక్కడ ఆపరేషన్ చేస్తారు, ఎంత ఖర్చవుతుందో తెలుసుకునే ప్రయత్నాలు చేసినట్లు తెలిసింది. ఇంతలోనే 26వ తేదీన అక్కడ వాటర్‌ట్యాంక్ నిర్మాణానికి తీసిన కుంటలో ప్రమాదవశాత్తు పడి మృతి చెందాడని రవిబాబుకు తెలియగా.. ఆయన పోస్టుమార్టం అనంతరం అంబులెన్స్‌లో మృతదేహాన్ని తీసుకుని శుక్రవారం రాజాపురం వచ్చాడు. అయితే, అంబులెన్స్‌ను మృతుడి ఇంటి వద్ద నిలిపేసిన రవిబాబు పోలీసుస్టేషన్‌కు వెళ్లిపోవడంతో దేవేందర్ కుటుంబ సభ్యులు, బంధువులు తమకు అనుమానాలు ఉన్నాయంటూ స్టేషన్ ఎదుట ఆందోళనకు దిగారు. దీంతో ఎస్‌ఐ శ్రీనివాస్ జోక్యం చేసుకుని హర్యానాకే వెళ్లి ఫిర్యాదు చేయాలని సర్దిచెప్పి పంపించారు.

టీడీపీ ఆవిర్భావ వేడుకలు

జూలూరుపాడు: తెలుగుదేశం పార్టీ 42వ ఆవిర్భావ వేడుకలు శుక్రవారం జూలూరుపాడులో ఘనంగా నిర్వహించారు. టీడీపీ నాయకులు ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రోకటి లక్ష్మీనరసింహారావు, చలమల గోవిందు, చావా వెంకటేశ్వరరావు, కోటం రాజు, పి.రామారావు, శంకర్‌రావు, నాగార్జున్‌రావు పాల్గొన్నారు.

బెల్ట్ షాపులపై పోలీసుల దాడి

పాల్వంచ: కిరాణా షాపుల్లో మద్యం అమ్ముతున్నట్లు సమాచారంతో పోలీసులు దాడులు చేశారు. శుక్రవారం పట్టణంలోని బొల్లేరుగూడెంలో జోబిన్, భద్రయ్య అనే ఇద్దరు వ్యక్తులు బెల్ట్‌షాపులు నిర్వహిస్తుండటంతో పట్టణ ఎస్‌ఐ రాఘవయ్య దాడి చేసి వారి నుంచి రూ.4వేల విలువ చేసే మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు. ఆ ఇద్దరిపై కేసు నమోదు చేశారు.




టేకులపల్లి: చర్చిలో ప్రార్థన చేస్తున్న భక్తులు



సిలువ యాత్రలో క్రైస్తవులు

భక్తిశ్రద్ధలతో శుభ శుక్రవారం

క్షమాగుణం.. పొరుగువారిపై ప్రేమ చూపించడం.. బాధ్యతగా వ్యవహరించడం.. ఆకలి, దప్పికతో అల్లాడుతున్న మానవాళికి.. ఏసు చూపిన మార్గం నేటికీ స్ఫూర్తినిస్తోందని ఫాదర్లు తెలిపారు. శుభ శుక్రవారం సందర్భంగా కొత్తగూడెం, ఇల్లెందు నియోజకవర్గాల్లోని చర్చిలలో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఏసుక్రీస్తు సిలువపై పలికిన ఏడు మాటల అంతరార్థాన్ని భక్తులకు వివరించారు. పాప విముక్తి కోసమే ఏసుక్రీస్తు సిలువ యాగం చేశాడని గుర్తుచేశారు. తన తోటివారి యెడల ప్రేమను, శత్రువు యెడల క్షమాపణను తెలియచేస్తూ సిలువను తన పరిశుద్ధ రక్తంతో తడిపి లోకానికి రక్షణ కల్పించాడని బోధించారు. అనంతరం 45 రోజులు ఉపవాసం ఉన్న వారితో దీక్ష విరమింపజేశారు. పాస్టర్ల ఆధ్వర్యంలో భక్తులు వీధుల్లో ఏసు కీర్తనలతో శిలువ మోస్తూ ర్యాలీ నిర్వహించారు. – సాక్షి నెట్‌వర్క్





పాల్వంచ: ఆర్‌సీఎం చర్చి ఆధ్వర్యంలో..



ఇల్లెందురూరల్: మామిడిగూడెం చర్చిలో



పాల్వంచ: సిలువ మార్గంలో క్రైస్తవులు



సుజాతనగర్: ఆర్సీఎం చర్చి ఆధ్వర్యంలో..



కొత్తగూడెంటౌన్: సెయింట్ ఆండ్రూస్ చర్చిలో..





సింగరేణి(కొత్తగూడెం): రామవరం నాగయ్యగడ్డలో ఏసు కీర్తనలు వినిపిస్తున్న క్రైస్తవులు, జూలూరుపాడులో సిలువ మోస్తున్న భక్తులు

తాగునీటి సదుపాయం కల్పించాలి

ఇల్లెందు: సీఎస్పీ బస్తీ, రాజీవ్‌నగర్ సమీపంలోని దేవులపల్లి యాకయ్యనగర్ వాసులు ఐదేళ్లుగా గుడిసెలు వేసుకుని కనీస సదుపాయాలు లేక జీవనం సాగిస్తున్నారు. వారికి నీటి సదుపాయం కల్పించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్యను ఆయన కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా స్పందించిన ఎమ్మెల్యే కోరం కనకయ్య అధికారులకు తగు ఆదేశాలు ఇచ్చారు. తక్షణం మంచినీటి సదుపాయం కలిపించాలని కోరారు. మౌలిక వసతులు కల్పించాలని అందుకు అక్కడి పరిస్థితితులను పరిశీలించి అంచనా వేయాలని సూచించారు. వినతిపత్రం అందజేసిన వారిలో ఎస్‌ఏ నబీ, ధరావత్ రాందాస్, వీరభద్రం, భీముడు, నర్సయ్య, సంతోష్, కౌసల్య, ప్రమీల, సుగుణ, కోటమ్మ, నీలారాణి, పద్మ, మంగ, ఎస్తేరు, జ్యోతి, కమల ఉన్నారు.



ఎమ్మెల్యేకు వినతిపత్రం అంజేస్తున్న స్థానికులు

మా ఇళ్లకు దారి చూపండి..



దారికి అడ్డంగా తవ్విన కాల్వను చూపుతున్న స్థానికులు

సుజాతనగర్: సుజాతనగర్‌లో ఓ వెంచర్‌కు దారికి అడ్డంగా మట్టికట్ట వేయడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. స్థానిక హెచ్‌పీ పెట్రోల్ బంకు వెనక వైపు వెంచర్‌లో సుమారు 21 ఇళ్లు ఉన్నాయి. సింగభూపాలెం చెరువు కాల్వ పక్క నుంచి వెంచర్‌లోకి రాకపోకలు సాగించేందుకు వీలుగా గతంలో దారి ఉండేది. కొందరు రైతులు ఆ దారికి అడ్డంగా కాల్వ తవ్వి మట్టి కట్ట వేసి దారిని మూసివేశారు. దీంతో 21 ఇళ్ల కుటుంబాలు దారి లేక అవస్థలు పడుతున్నారు. ఇక్కడ ఉన్న కల్వర్టు కింద సిమెంట్ పైపు ద్వారా గతంలో పంట పొలాలకు నీటి సరఫరా జరిగేది. ఈ క్రమంలో కల్వర్టు వద్ద పూడిక పేరుకపోయి నీటి సరఫరా నిలిచిపోయింది. పొలాలకు నీటి సరఫరా నిలిచిపోవడంతో నీటి కోసం రైతులు కాల్వ తవ్వినట్లు స్థానికులు అంటున్నారు. ఏది ఏమైనా ప్రస్తుతం వీరికి దారి లేకుండా పోయింది. అధికారులు స్పందించి కాల్వ కింద నుంచి నీటి సరఫరా యథాతదంగా జరిగేలా చేసి దారిని పునరుద్ధరించాలని బాధితులు డిమాండ్ చేస్తున్నారు.

కల్యాణ తలంబ్రాల తయారీ

పాల్వంచ: పట్టణంలోని శ్రీనివాసగిరిపై శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానం (గుట్ట)లో ఏప్రిల్ 3వ తేదీ నుంచి జరగనున్న వార్షిక కల్యాణం పూజల సందర్భంగా శుక్రవారం ఆలయ ప్రాంగణంలో భక్తులచే పసుపు కొట్టి, స్వామి వారి కల్యాణ తలంబ్రాలు కలిపే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా అర్చకులు తోలేటి నగేశ్ శర్మ, ఫణిరాజాచార్యుల ఆధ్వర్యంలో వేదమంత్రాలతో పూజలు నిర్వహించి సంప్రదాయబద్ధంగా సుమారు వెయ్యి మంది మహిళలు పాల్గొని పసుపు కొట్టి, తలంబ్రాలు కలిపారు. అనంతరం స్వామి కల్యాణ వీడియో టీజర్‌ను సబ్బెళ్ల గోవిందరెడ్డి ఆవిష్కరించారు. కార్యక్రమంలో భక్తసమాజ మండలి అధ్యక్షుడు ఆరుట్ల లక్ష్మణాచార్యులు, ప్రధాన కార్యదర్శి ధర్మపురి రాము, కందుకూరి రామకృష్ణ, పసుమర్తి వెంకటేశ్వరరావు, తాటికొండ శ్రీలత, లక్ష్మారెడ్డి, బండి వెంకటేశ్వర్లు, కంఠాల వెంకటేశ్వరరావు, రవి, వేమూరి వెంకటేశ్వరరావు, మేదరమెట్ల శ్రీనివాసరావు పాల్గొన్నారు.



తలంబ్రాలు కలుపుతున్న మహిళలు



పూజలో పాల్గొన్న భక్తులు

ప్రజలు పోలీసులకు సహకరించాలి..



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న డీఎస్పీ అబ్దుల్ రెహమాన్



నంబర్ ప్లేట్ లేని బైక్‌లను పట్టుకున్న పోలీసులు

కొత్తగూడెంటౌన్: నేరాల నియంత్రణకు ప్రజలు పోలీసులకు సహకరించాలని, నంబర్ ప్లేట్ లేని వాహనాలను నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని కొత్తగూడె డీఎస్పీ అబ్దుల్ రెహమాన్ అన్నారు. శుక్రవారం కొత్తగూడెం వన్‌టౌన్, త్రీటౌన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో వాహన తనిఖీలపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. నంబర్ ప్లేట్ లేని వాహనాలను గుర్తించి అవి నడిపిన వ్యక్తులు త్రీటౌన్ పోలీసు స్టేషన్ పరిధిలో ఇద్దరు, వన్‌టౌన్ పరిధిలో ముగ్గురిపై చీటింగ్ కేసులను నమోదు చేశారు. డీఎస్పీ మాట్లాడుతూ.. దొంగతనాలు చైన్ స్నాచింగ్‌లకు పాల్పడుతున్నవారు నంబర్ ప్లేట్ లేని వాహనాలు వినియోగిస్తున్నట్లు చెప్పారు. నేరాల నియంత్రణ చేదనకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కొత్తగూడెం వన్‌టౌన్, త్రీటౌన్ సీఐలు కరుణాకర్, శివప్రసాద్, ట్రాఫిక్ ఎస్సైలు నరేష్, మదార్ పాల్గొన్నారు.

సత్ప్రవర్తనతో మెలగాలి..

ప్రతి రౌడీషీటర్ సత్ప్రవర్తనతో మెలగాలని, వారిపై నిఘా ఉంటుందని కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్ రెహమాన్ అన్నారు. శుక్రవారం కొత్తగూడెం వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో డీఎస్పీ రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఎన్నికలు సమీపిస్తున్నందున అందరూ జాగ్రత్తగా ఉండాలన్నారు. ఎవరైనా అసాంఘిక శక్తులకు సహకరించినా, గొడవలు చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతి పోలీసుస్టేషన్ పరిధిలో ఉన్న రౌడీషీటర్ ప్రవర్తనను బాగుండేలా చూడాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం వన్‌టౌన్ సీఐ ఎం.కరుణాకర్, ఎస్.ఐ విజయ పాల్గొన్నారు.

కార్మికవాడల్లో పారిశుద్ధ్యం అధ్వానం



రుద్రంపూర్‌లో డ్రైయినేజీ దుస్థితి



మార్కెట్ ఏరియాలో పేరుకపోయిన చెత్త

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ఏరియా పరిధిలోని రుద్రంపూర్, గౌతంపూర్, ధన్‌బాద్, మార్కెట్ ఏరియా, ఆస్పత్రి ఏరియాలలో పారిశుద్ధ్యం పడకేసింది. సింగరేణి యాజమాన్యం కార్మికుల ఆరోగ్య పరిరక్షణ కోసం, కార్మిక వాడల్లో పారిశుద్ధ్యం పనులు చేపట్టేందుకు పలు ప్రాంతాలను విభజించి, కాంట్రాక్ట్ కార్మికులను ఏర్పాటు చేసి రెండు సంవత్సరాలకు రూ.కోట్ల టెండర్లను పిలిచి కాంట్రాక్టర్లకు కట్టబెట్టింది. వారు పారిశుద్ధ్య పనులను పర్యవేక్షించాల్సి ఉంది. కాంట్రాక్టర్ల నిర్లక్ష్యానికి, సివిక్ అధికారుల అలసత్వం తోడవటంతో కార్మిక వాడల్లో చెత్తకుప్పలు పేరుకపోవడమే కాకుండా కాలువలు నిండి దుర్గంధం వెదజల్లుతోంది. దీంతో ఆయా ప్రాంతాలు దోమలకు కేంద్రాలుగా ఏర్పడి అనారోగ్యం పాలవుతున్నామని కార్మిక కుటుంబాలు ఆరోపిస్తున్నాయి. ఏరియాలో ఎంతమంది ఏఏ ప్రాంతాల్లో పనిచేస్తున్నారో పర్యవేక్షించాల్సిన సిబ్బంది, సెకండరీ స్థాయి అధికారులు కార్యాలయాలను వీడని కారణంగా కాలనీలలో చెత్తకుప్పలు దర్శనమిస్తున్నాయి. అంతే కాకుండా బ్లీచింగ్ చల్లేవారే లేరు. ఈ విషయం ఏరియా సివిల్ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదని కార్మిక సంఘాల నాయకులు వాపోతున్నారు. ఇదిలా ఉండగా గతంలో కార్పొరేట్ స్థాయి డైరెక్టర్లు, ఏరియాలో జీఎంలు, ఇతర విభాగాల అధికారులు కాలనీలలోని శివారు ప్రాంతాలలో పాదయాత్రలు (కార్మికుల వద్దకు అధికారులు) నిర్వహించి కాలనీలలో క్వార్టర్ల అన్యాక్రాంతం నుంచి, సివిల్, సివిక్, ఇతరత్రా అన్ని అంశాలపై నేరుగా కార్మిక కుటుంబాలను కలిసి సమస్యలను అడిగి తెలుసుకునేవారు. కానీ సింగరేణిలో 2014 నుంచి పూర్తిస్థాయి డైరెక్టర్ (పా) నియామకం జరగక, ఇన్‌చార్జ్ పాలన వలన సంక్షేమ కార్యక్రమాలను విస్మరించారని, తద్వారా కాలనీలో కార్మికులకు సంబంధించిన కార్యక్రమాలు నిర్వహించటం లేదనే సింగరేణి కార్మికులు చెబుతున్నారు. ఇప్పటికైనా ఏరియాలోని సివిల్, సివిక్ అధికారులు స్పందించి కాలనీలలో పర్యవేక్షణ చేయాలని కార్మికులు కోరుతున్నారు.

పల్లె ప్రగతిలో వెనకడుగు

పరిపాలనకు, ప్రణాళిక రచనకు మూలాధారం గ్రామాలే.. గ్రామీణ ప్రజలకు అత్యంత చేరువలో ఉండేది స్థానిక ప్రభుత్వాలు. అందులో మొదటి స్థాయిలో ఉండేది గ్రామపంచాయతీలు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న అభివృద్ధి పథకాల అమలు, ప్రణాళిక మండల పరిషత్‌లదే. అంతేకాకుండా ప్రజలలో స్వయం సహాయక ప్రవృత్తిని పెంపొందించి, ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపర్చేందుకు కృషి చేయడం మండల పరిషత్‌ల బాధ్యత. కానీ ప్రస్తుతం మండల పరిషత్ ప్రజాప్రతినిధుల అడుగులు ఆ దిశగా అంతగా కనిపించడం లేదు. ఇందుకు పరిపాలనాపరమైన కారణాలు అనేకం ఉన్నప్పటికీ ప్రజలకు మేలు చేకూరేలా పనులు చేపట్టాలన్న అంకితభావం పాలకుల్లో కొరవడింది.

- అంతటా కాంక్రీట్ పనులకే ప్రాధాన్యం
- ప్రధాన సమస్యలపై పట్టింపులేని మండల పరిషత్
- మూడు నెలల్లో ముగియనున్న పదవీకాలం

ఇల్లెందురూరల్: మండల పరిషత్‌లకు సొంతంగా నిధులు సమకూర్చుకునే అవకాశం అంతగా లేదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మంజూరు చేసే గ్రాంట్లపైనే ఆధారపడుతుంది. ఐదేళ్లుగా ఇల్లెందు మండల పరిషత్‌కు రూ.కోటి నిధులు మంజూరు కాగా పలు అభివృద్ధి పనులకు ఖర్చు చేశారు. ప్రస్తుతం ఖాతాలో ఎస్‌ఎఫ్‌సీ రూ.35 లక్షలు, 15వ ఆర్థిక సంఘం ద్వారా మంజూరైన నిధులలో రూ.75 లక్షలు ఉన్నాయి.

కాంక్రీట్ పనులకే ప్రాధాన్యత...

గ్రామపంచాయతీ మొదలు, మండల పరిషత్, నియోజకవర్గ స్థాయిలో మంజూరైన నిధులు ఏవైనా తొలి ప్రాధాన్యత సీసీ రోడ్లకే. గ్రామాలలో అంతర్గత రహదారుల అభివృద్ధి ముఖ్యమే కానీ గ్రామాల మధ్య, పంట చేలకు వెళ్లేందుకు రహదారి వ్యవస్థ మెరుగుపర్చాల్సిన బాధ్యత కూడా పాలకులపై ఉంటుంది. సీసీ రహదారుల పేరుతో ఇతర అభివృద్ధి పనులను విస్మరించడం పట్ల ప్రజలు సైతం విస్మయం వ్యక్తం చేస్తున్నారు. మామిడిగూడెం గ్రామపంచాయతీ వెంకటాపురం గ్రామ శివారులో చిన్నపాటి వాగు ప్రవహిస్తోంది. ఈ వాగుపై దశాబ్దాల క్రితం చెక్‌డ్యాం నిర్మించారు. కాలక్రమేణా చెక్‌డ్యాం పైభాగం కొట్టుకుపోయింది. వెంకటాపురం గ్రామస్తుల పంట చేలన్నీ వాగు అవతలవైపు ఉన్నాయి. చెక్‌డ్యాం ఛిద్రమైపోవడంతో వాగు దాటడం ఇబ్బందిగా మారింది. వానాకాలం వరద వస్తే చేలకు వెళ్లేందుకు ఐదు కిలోమీటర్లు చుట్టు తిరిగి రాని పరిస్థితి. ఇదిలా ఉండగా రేపల్లెవాడ గ్రామం నుంచి కట్టుగూడెం గ్రామం వరకు



మండల పరిషత్ కార్యాలయం

రెండేళ్ల క్రితం బీటీ రోడ్డు వేశారు. మార్గమధ్యలో వంతెన నిర్మాణాన్ని విస్మరించడంతో వాగు ఉధృతికి రెండేళ్ల క్రితమే కొట్టుకుపోయింది. గ్రామపంచాయతీ ద్వారా మొరం పోసి తాత్కాలిక పనులు చేసినప్పటికీ శాశ్వత ప్రాతిపదికన వంతెన నిర్మించాలన్న గ్రామస్తుల డిమాండ్ అరణ్యరోదనగానే మిగిలిపోయింది. పల్లెల్లో తక్కువ ఖర్చుతో చేయాల్సిన ఇలాంటి పనులు అనేకం ఉన్నాయి. సీసీ రహదారులతోపాటు ఇలాంటి పనులకు కూడా నిధులు కేటాయించాలని ప్రజలు కోరుతున్నారు.

ఏటా అన్నదాతకు తప్పని నీటికష్టాలు...

వంద ఎకరాలకు నీటిని అందించే సామర్థ్యం కలిగిన చెరువు ఒక్కటీ మండలంలో లేకపోవడంతో రైతులు వర్షాధారంలపైనే ఆధారపడి పంటలు పండిస్తారు. బోర్లు, బావుల కింత భూగర్భ జలాల స్థాయిని బట్టి సాగు చేస్తారు. భూగర్భ జలాలను అభివృద్ధి చేసేందుకు గ్రామాల సమీపంలో ఉన్న వాగులపై చెక్‌డ్యాంలు నిర్మించడం ప్రధాన అవసరం. ఆ దిశగా నిధులు ఖర్చు చేయాల్సిన పాలకులు తమ బాధ్యతను విస్మరించడం వల్ల భూగర్భ జలాలు అడుగంటిన సమయంలో అన్నదాతల కళ్ల ముందే పంటలు ఎండిపోతుంటే కన్నీరుమున్నీరవుతున్నారు. ఇప్పటి వరకు రైతుల ఒత్తిడి మేరకు మండలంలో కేవలం మస్సివాగుపై ఒకే ఒక్క చెక్‌డ్యాం నిర్మించారు. ప్రస్తుతం మస్సివాగు, చలివాగు, ముర్రేడు వాగు తదితర ప్రధాన వాగులతోపాటు చిన్నచిన్న వాగులు మండలంలో అనేకం ఉన్నాయి. వాటిపై చెక్‌డ్యాంల నిర్మాణానికి పాలకులు ప్రాధాన్యమివ్వాలని రైతులు కోరుతున్నారు.

తీర్మానాలూ నామమాత్రమే..

మండల పరిషత్ పదవీకాలం మరో మూడు నెలల్లో ముగియనుంది. గడిచిన ఐదేళ్లుగా అనేక సమావేశాలు నిర్వహించారు. ఆయా సమావేశాలలో పోడు భూములు, తాగునీరు, పీహెచ్‌సీలు, ఎక్సైజ్, వ్యవసాయం, విద్యుత్ వంటి శాఖలకు సంబంధించి పనులు సాగడం లేదన్న కారణాలపై అధికారులను నిలదీయడం మినహా సాధించిన పురోగతి నామమాత్రమేనని చెప్పాలి. కొమరారం పీహెచ్‌సీ నుంచి డిప్యూటేషన్‌పై గుండాలకు పంపిన వైద్యాధికారిని వెనక్కు రప్పించాలని, మండలంలో బెల్ట్ షాపులను ఎత్తివేయాలని, సమావేశాలకు గైర్హాజరైన మండల స్థాయి అధికారులపై చర్య తీసుకోవాలని.. ఇలా అనేక తీర్మానాలు చేశారే తప్ప, ఏ ఒక్కటీ అమలుకు నోచుకోలేదు. ఇక మండల పరిషత్ కార్యాలయ స్థలంలో నూతనంగా నిర్మిస్తున్న వ్యాపార సముదాయం, విశ్రాంతి భవనం నిధుల లేమితో అసంపూర్తిగా ఉండగా.. ఉన్న ఒక్కగానొక్క వ్యాపార సముదాయానికి టెండర్ నిర్వహించడంలో కొనసాగుతున్న నిర్లక్ష్యం.. ఇలా అనేక కారణాలు మండల పరిషత్ ప్రగతిపై ప్రభావం చూపుతున్నాయన్న ఆరోపణలు సర్వత్రా వినిపిస్తున్నాయి.




రెపల్లెవాడ వద్ద తాత్కాలికంగా వేసిన మట్టిరోడ్డు



వెంకటాపురం వద్ద కొట్టుకుపోయిన చెక్‌డ్యాం

నిధులు మంజూరు కాలేదు...



మండల పరిషత్‌కు ఎన్నికల జరిగిన తరువాత రెండేళ్లు నిధులు రాలేదు. ఆ తరువాత వచ్చిన నిధులను ఎంపీటీసీలు ఇచ్చిన ప్రతిపాదనల మేరకు ఖర్చు చేశాం. ఇతర అభివృద్ధి పనులు చేయాలని ఉన్నా నిధులు మంజూరు కాలేదు. వచ్చే మూడు నెలల్లో ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేయించుకొని ప్రజల ఆకాంక్షకు అనుగుణంగా పనులు చేస్తాం.

– చీమల నాగరత్నమ్మ, ఎంపీపీ, ఇల్లెందు